క్లుప్తంగా

శిలాఫలకాల ధ్వంసం హేయం



అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : తమ పాలకమండలి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తమ హయాంలో పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు వాటిని ధ్వంసం చేయడం సరికాదన్నారు. శ్రీకాళహస్తిలోని నంది సర్కిల్, హరహర తీర్థం, శివయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారని తెలిపారు. శిలాఫలకాలు దేవస్థానం ఆస్తి అని వాటిని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈఓ స్పందించి వాటిని తిరిగీ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ : ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని, వార్డెన్ అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం మధ్యాహ్నం సిబ్బందితో కలసి కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, వంటవాళ్లకు హెచ్చరికలు జారీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని, అలా కానీ పక్షంలో చర్యలు తీసుకుంటామని వార్డెన్ సచిన్‌ను హెచ్చరించారు. అదే విధంగా హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పార్లపల్లి గ్రామం వద్ద కేటీరోడ్డు మలుపు సమీపంలో లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీలోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి నుంచి తడకు వెళుతున్న ఖాళీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీలోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సిలబస్ పూర్తి కాలేదని ఆవేదన

రేణిగుంట : గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ బోధనా సిబ్బంది సమ్మెలో ఉన్నారు. దీంతో సిలబస్ పూర్తి కాక చదువు కుంటుపడుతోందని శనివారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో పదో తరగతి విద్యార్థులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని వెళ్లగక్కారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



శ్రీసిటీ పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

వరదయ్యపాళెం : శ్రీసిటీ పారిశ్రామికవాడకు చెందిన గ్రామాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా తమిళనాడు సరిహద్దు దాటుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు శ్రీసిటీ పోలీస్ స్టేషన్ సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. నాయుడుపేట నుంచి శ్రీసిటీ గ్రామాల మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరివద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అక్రమ రవాణాగా నిర్ధరణ చేశారు. దీంతో ట్రాక్టర్ యజమానులైన సురేష్, సుధాకర్, వెంకటేశ్వర్లు, డ్రైవర్లు మహేంద్ర, వెంకటసాయిలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో రెఫర్ల పర్వం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రెఫర్ల పర్వం కొనసాగుతోంది. శనివారం హరీష్, కుష్బు దంపతులు వచ్చి తన భార్యకు డెలివరీ డేట్ ఈ రోజుల్లో ఇచ్చారని ఆస్పత్రికి వచ్చారు. ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రక్తం నిల్వలు లేవని వెంటనే తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. 2వ తేదీ నుంచి ప్రభుత్వాస్పత్రికి వస్తున్నామని ఇప్పుడు అర్జెంట్‌గా తిరుపతికి తీసుకెళ్లాలని చెప్పడం సరికాదని వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఇవాళ కాన్పు చేస్తామని చెప్పడంతో ఆస్పత్రికి వచ్చామని ఆ వైద్యురాలితో చెప్పగా ఈ రోజు విధుల్లో ఉన్న వైద్యులను సంప్రదించాలని చెప్పి నిర్లక్ష్యంగా వెళ్లిపోయారన్నారు. విధుల్లో ఉన్న మరో వైద్యులను సంప్రదించగా రక్తనిల్వలు లేవని ఆలస్యం అవుతుందని ఆలోపు మెటర్నిటీకి వెళ్లిపోవచ్చని చెప్పారని బాధితులు వాపోయారు. రక్తనిల్వలు లేక గర్భిణిని రెఫర్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సత్యవేడు-కదూరు కూడలిలో ఇరుక్కుపోయిన లారీని బయటకు తీస్తున్న దృశ్యం (ఫైల్)



తడ-శ్రీకాళహస్తి రోడ్డు దడ



కారణిమిట్ట వద్ద వాటర్ పైపులైన్ గోతిలో దిగబడిన లారీ

తడ- శ్రీకాళహస్తి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న గ్యాస్, వాటర్ పైపులైన్ కోసం తీస్తున్న కాలువలు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు కాస్త రోడ్డు దిగితే ఇక డ్రైవర్‌లకు జాగారమే.. వాహనాలు ఎక్కడికక్కడ దిగబడి కూరుకుపోతున్నాయి. దీంతో రోజంతా ఇరుక్కుపోయిన వాహనాన్ని బయటకు లాగేందుకు డ్రైవర్ల తిప్పలు వర్ణనాతీతం. కేవలం అనాలోచిత నిర్ణయంతో పైపులైన్ల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇవ్వడమే ఈ అవస్థలకు కారణమని స్థానిక ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు.

– వరదయ్యపాళెం

- వాహనాలు రోడ్డు దిగితే జాగారమే
- ఎక్కడికక్కడే దిగబడిపోతున్న లారీలు
- అధికారుల నిర్లక్ష్యానికి వాహనదారుల ఇక్కట్లు
- రోడ్డుకు ఆనుకుని పైపులైన్ పనులతో ప్రమాదాలు

తుపాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన పైపులైన్ కాలువలు పూర్తిగా కుంగిపోవడంతో ఆ కాలువల్లో వాహనాలు పూర్తిగా దిగబడి పోతున్నాయి. కొద్ది రోజులుగా శ్రీకాళహస్తి-తడ, కదూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గంలో తరచూ వాహనాలు దిగబడి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పర్యవేక్షణ లేని పనులు

పరిశ్రమల కేంద్రంగా సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలు విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లు ఇలాంటి నిర్లక్ష్యపు పైపులైన్ల ఏర్పాటు, పర్యవేక్షణ లేని అధికారుల తీరుతో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రాధాన్య క్రమంలో ఉన్న ఈ ప్రాంతంలో ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు నోరు మెదపకపోవడం, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్న గుత్తేదారులపై చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

స్తంభిస్తున్న రాకపోకలు

తడ-శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గంలోని కారణిమిట్ట వద్ద లారీ వాటర్ లైన్ కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌లో శుక్రవారం దిగబడిపోయింది. దీంతో రోజంతా లారీని బయటకు తీసేందుకు వారి కష్టాలు చెప్పనలవి కాదు. రెండు రోజుల కిందట నెలవాయి వద్ద భారీ కంటైనర్ వాహనం ఇదే విధంగా దిగబడి ఏకంగా గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల కిందట సత్యవేడు-కదూరు కూడలి మార్గంలోని సుబ్బరాజుకండ్రిగ వద్ద లారీ దిగబడి 3 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఇలా రోజువారీగా రెండు ప్రధాన మార్గాల్లో ఎక్కడో ఓచోట వాహనాలు దిగబడి ట్రాఫిక్ ఇబ్బందులు షరామామూలుగా మారుతున్నాయి. ఈ మార్గాల్లో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు సకాలంలో చేరుకుని ఇళ్లకు వెళ్తామా? అన్న సందేహాలతో సతమతమవుతున్నారు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ రోడ్డు మార్గాల విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకర పరిస్థితులను గుర్తించాలి



ఆర్ అండ్ బీ రోడ్ల పక్కనే రోడ్డుకు ఇరువైపులా పైపులైన్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటికైనా ప్రమాదకరమే. రోడ్లకు ఆనుకుని పైపులైన్ కోసం తవ్వుతున్న కాలువలు వాహనాలు దిగబడేందుకు కారణమవుతున్నాయి. వర్షాకాలంలో వాహనదారులకు అవస్థలు తప్పవు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను అధికారులు గుర్తించాల్సి ఉంది.

– మహేంద్ర, చిన్న పాండూరు

అనుమతి ఇవ్వడమే తప్పిదం



ప్రధాన రోడ్లకు ఇరువైపులా పైపులైన్ల ఏర్పాటు కోసం అధికారులు అనుమతి ఇవ్వడమే పెద్ద తప్పిదం. అనుమతి ఇచ్చినా ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో రోడ్డుకు ఇరువైపులా కనీసం 2 మీటర్ల దూరంలో పైపులైన్‌లు ఏర్పాటు చేసుంటే ప్రస్తుతం వాహనాలు దిగబడే పరిస్థితి ఉండేది కాదు. అనుమతులిచ్చిన అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పైప్‌లైన్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంతో కాలువలు తవ్వడంతో నిత్యం వాహనాలు దిగబడి ప్రమాదాలకు గురవుతున్నాయి.

– శీను, బీఎన్‌కండ్రిగ

వర్షాలు తగ్గే వరకు పనులు నిలిపివేశాం



భారీ వర్షాల కారణంగా రోడ్లకు ఇరువైపులా వాహనాలు దిగబడే పరిస్థితులు ఉన్న కారణంగా పైపులైన్‌ల కోసం చేపడుతున్న తవ్వకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశాం. అంతేకాకుండా రోడ్డుకు ఆనుకుని కాలువలు ఏర్పాటు చేసేందుకు వీలు లేదని తమ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం. కొన్నిచోట్ల రోడ్డు పక్కన తవ్వినప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. కాలువల వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రాంబాబు, ఆర్‌అండ్‌బీ డీఈ, శ్రీకాళహస్తి

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



ఊంజల్ సేవలో కల్యాణ వెంకన్న

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవరులకు ఊయల సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు చేశారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని, అత్యధిక సంఖ్యలో దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్టింపజేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయల సేవలో ఉత్సవ మూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ మల్లికార్జున ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాలుర గురుకులానికి 25 కంప్యూటర్లు

సత్యవేడు : గురుకుల పాఠశాలలో సీబీఎస్‌ఈ బోధనకు ప్రభుత్వం 25 కంప్యూటర్లు మంజూరు చేసిందని ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కంప్యూటర్లకు ప్రత్యేక గది కేటాయించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈఓ రవి, స్కూల్ కమిటీ చైర్మన్ సురేష్ కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించామన్నారు. 9వ తరగతి విద్యార్థులకు ఎమ్మెస్ ఆఫీస్, కంప్యూటర్లలో ప్రాథమిక పరిజ్ఞానం , సమాచార నైపుణ్యాలు నేర్పించి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో డీఎస్పీ

శ్రీకాళహస్తి : విద్యార్థులు మంచి నడవడికతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణం, తొట్టంబేడు మండలంలోని పలు పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశానికి శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, పురపాలక సంఘం కమిషనర్ గిరికుమార్ హాజరయ్యారు. గత సంవత్సరంలో గురుకుల విద్యార్థులు సాధించిన విజయాలను ప్రిన్సిపల్ ప్రభావతి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తొట్టంబేడు మండలం ఎగువసాంబయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో కూడా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో భారతి, ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్ : మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ద్వారా విద్యార్థుల విద్యా పురోగతికి బంగారు బాటలు పడుతాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి అధికారులతో కలిసి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ తర్వాత సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు , ఆరోగ్యం, ఆసక్తిపై అవగాహన కోసం గురువులతో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. అదనపు గదులు, ఆర్వో ప్లాంట్ మంజూరు కోసం చర్యలు తీసుకుంటామని, ఆట స్థలం కోసం ఆర్డీఓ స్థలం పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు. హాస్టల్ వసతి, జూనియర్ కళాశాల ఏర్పాటు కోరగా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో టగ్ ఆఫ్ వార్ కార్యక్రమంలో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. సమావేశాలు విద్యార్థుల భవిష్యత్తు కోసమేన్నారు. రూరల్ స్టేషన్ హౌస్ అధికారి రవి నాయక్ సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, డీఎంహెచ్ ఓ శ్రీహరి, ఎంపీడీఓ రఫీ పటాన్ ఖాన్, ఎంఈఓ భువనేశ్వరి, సీడీపీఓ, పాఠశాల హెచ్‌ఎం కష్ణయ్య, ఎస్‌ఎంవసీ చైర్మన్ అచ్యుతయ్య ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జేసీ

రేణిగుంట : విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో భాగంగా శనివారం రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బొమ్మలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజ్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎంఈవో ఇందిరాదేవి, రంగనాథయ్య, హెచ్‌ఎం విష్ణువర్ధనం పాల్గొన్నారు. మండలంలోని కరకంబాడి హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు హాజరై రోడ్డు భద్రత గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ శరత్‌చంద్ర, హెచ్‌ఎం పుష్పలత పాల్గొన్నారు. అలాగే ఏర్పేడు మండలంలోని అన్ని పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహిచారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించుకోండి



న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి : జాతీయ లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని న్యాయస్థాన భవనంలో అధికారులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయస్థానానికి మధ్య న్యాయవాదులు మధ్యవర్తిత్వంగా ఉండి కోర్టులోని పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్ ఉచిత సిమ్ మేళా

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో ఆదివారం బీఎస్‌ఎన్‌ఎల్ ఉచిత సిమ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ ఏరియా అధికారి వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఉచిత మేళా కార్యక్రమంలో నూతన సిమ్‌లు, 3జీ నుంచి 4జీ సిమ్‌కు మారేందుకు, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి

శ్రీకాళహస్తి : తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. బాబుఅగ్రహారం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు. సోషల్ మీడియా వంటి వాటిపై విద్యార్థులు ఆకర్షణకు గురవుతున్నారని తెలిపారు. గురువులు విద్యాబుద్ధులు మాత్రమే నేర్పుతారని, తల్లిదండ్రులు వారి మార్పు, ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుదాం



సత్యవేడులో విద్యార్థుల ప్రదర్శన, బుచ్చినాయుడుకండ్రిగ : టగ్ ఆఫ్ వార్..

సత్యవేడు : పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు పేరెంట్స్-టీచర్స్ మీట్ దోహదపడుతుందని ఎంఈఓ రవి అన్నారు. శనివారం సత్యవేడులో రంగోళి, టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి,ఎస్‌ఐ రామస్వామి, డాక్టర్ మురళీ కృష్ణ, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములవుదామని విశ్రాంత ఎస్పీ రమేష్ నాయుడు పేర్కొన్నారు. శనివారం బుచ్చినాయుడు కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సుధాకర్‌నాయుడు, కోటేశ్వరరావు, మునెయ్యనాయుడు, యోగా గురువు సురేష్ నాయుడు పాల్గొన్నారు.

నాగలాపురం : మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శనివారం మండల విద్యాశాఖ అధికారి బాబయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి డాక్టర్ రామచంద్రన్ పాల్గొని సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య , ప్రజాప్రతినిధులు చిన్నదొరై, శ్యామ్, దేశప్పన్, మురళి పాల్గొన్నారు.

నారాయణవనం : పిల్లల భవిష్యత్తుకు గట్టి పునాదిని వేసే విద్యను అభివృద్ధిని సాధించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరస్పర అవగాహన ఉండాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వ్యక్తిగత హోలిస్టిక్ కార్డును జడ్పీటీసీ సభ్యుడు సుమన్, అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులు నవీన్‌కుమార్, బాలాజీలను సన్మానించారు. అనంతరం తలిదండ్రులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రత్యేక అధికారి విజయకుమార్, పుత్తూరు డిప్యూటీ డీఈవో ప్రభాకర్ రాజు, ఎంఈవో జనార్దన రాజు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చూడాలి



ఏర్పేడు మండలం చింతలపాళెంలో రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ భార్గవి

రేణిగుంట : ఏర్పేడు మండలంలోని చింతలపాళెం ఎస్సీ కాలనీ నుంచి పాఠశాలకు వెళ్లే దారిలో నీళ్ల నిల్వ లేకుండా చూడాలని ఏర్పేడు తహసీల్దారు భార్గవికి విన్నవించారు. మండలంలోని చింతలపాళెంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ అక్కడకు వెళ్లి పరిశీలించి దారిలో ఆక్రమణలు లేకుండా హద్దులను ఏర్పాటు చేసి నీటి నిల్వ లేకుండా జేసీబీతో క్లీన్ చేయించాలని సూచించారు. సదస్సులో డీటీలు రోజారమణి, ప్రేమ్ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేణిగుంటలో...: రేణిగుంట మండలం మామందూరులో తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఇక్కడ మొత్తం 12 వినతులను స్వీకరించారు.

శ్రీసిటీ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఎత్తేయండి



కొల్లడం భూములు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్న రైతులు

సత్యవేడు : శ్రీసిటీ పరిధిలోని గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్‌ల నిషేధాన్ని తొలగించాలని కొల్లడం రైతులు రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సుబ్రహ్మణ్యంను కోరారు. శనివారం కొల్లడం పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. 2007 నుంచి సత్యవేడు రిజిస్ట్రార్ కార్యాలయంలో కొల్లడం రైతుల భూముల రిజిస్ట్రేషన్లు చేయడం లేదన్నారు. ఇంటి అవసరాలు, పిల్లల వివాహాలకు తల్లిదండ్రుల స్వార్జిత ఆస్తులైన భూములు విక్రయించుకొనేందుకు వీలులేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిషేధం తొలగించాలని కోరారు. ఏపీఐఐసీకి చెరివి పరిధిలోని భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా లేరన్నారు. ఏపీఐఐసీ భూసేకరణకు సభలు నిర్వహించి రైతుల అభిప్రాయంతో భూసేకరణ చేపట్టాలని వినతులు ఇచ్చారు. జగనన్న కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్లు తొలగించాలని లబ్ధిదారులు కోరారు. ఇళ్లపై లైన్లు ఉండడంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు పూర్తి చేయలేకున్నామన్నారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలకు ఆటస్థలం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంచయ్య, ఎంపీటీసీ కే. శెల్వి, తహసీల్దారు టీ. సుబ్రమణ్యం,వీఆర్‌ఓ వినోద్, సెక్రటరీ లీలామాధవ్, నాయకులు ప్రవీణ్‌కుమార్, వీకే పరమశివం , రమణయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు సరుకులు అందజేత



గిరిజనులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీ వేంకటేశ్వర గిరిజన కాలనీ వాసులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో సత్యవేడు మండలం ఇరుగళంకు చెందిన దాత జయశంకర్‌రెడ్డి ద్వారా నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. శనివారం వేంకటేశ్వర గిరిజన కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 70 కుటుంబాల గిరిజనులకు 10 కిలోల చొప్పున బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. దాత జయశంకర్‌రెడ్డి చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ నాగరాజు యాదవ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ : ఇటీవల మరణించిన రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి బందిల బాలయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి : మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్న గోవర్ధనపురం కాజ్‌వేను పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతేకాక హైలెవల్ వంతెనకు అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు పసుపుమయం



వేలంపాడు రెవెన్యూ సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలో జరుగుతున్న రె వెన్యూ సదస్సు మొత్తం పసుపుమయంగా మారింది. మండలంలోని వేలంపాడు సచివాలయంలో శనివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. సదస్సు మొత్తం పసుపుమయమై పార్టీ మీటింగ్‌ను తలపించే విధంగా ఉండటంతో పార్టీ మీటింగా ? ప్రభుత్వ కార్యక్రమమా? తెలియడం లేదంటూ స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సదస్సుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరు కావడం గమనార్హం. అంతా పసుపుమయంగా ఉండటంతో సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు వెనుకంజ వేశారు.